క్లుప్తంగా

గ్రామాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



కొల్లిపర: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యమయ్యేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చూడాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు చివరి రోజు శిక్షణ జరిగింది. వీధి దీపాల ఏర్పాటు, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక పై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎవో చంద్రమోహన్, ఈవోపీఆర్డీ పూర్ణ శంకరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోండి

టుటౌన్ సీఐ సుధాకర్



తెనాలిఅర్బన్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని టుటౌన్ సీఐ ఎ.సుధాకర్ పేర్కొన్నారు. గంగానమ్మపేటలోని నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో బుధవారం స్కూల్ లీడర్‌ల ఎంపికను నిర్వహించారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించి బ్యాడ్జీలు అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కేబీవీ నాగలక్ష్మి, ఆర్ఐ పూర్ణిమ, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ కార్యాలయం ప్రారంభం



తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ కార్యాలయాన్ని బుధవారం సంస్థ జోనల్ మేనేజర్ సాగర్‌కుమార్ ప్రారంభించారు. కంపెనీ సిస్టంను ఏరియా మేనేజర్ శివనాగేశ్వరరావు ఆరంభించారు. ఆరోగ్యబీమా రంగంలో తొలిగా ఆరంభమైనది స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థగా సాగర్‌కుమార్ వెల్లడించారు. ఆర్థికంగా ఎందరో కష్టమర్లను ఆదుకున్నట్టు తెలిపారు. ఆంధ్రాప్యారిస్ తెనాలిలో ఏజెంట్ కార్యాలయాన్ని ఆరంభించటం శుభపరిణామంగా చెప్పారు. సలహాదారు గోనుగుంట్ల జయంత్‌కుమార్ మాట్లాడుతూ స్టార్ హెల్త్ కంపెనీ ప్రారంభించి 18 ఏళ్లయిందనీ, ఇప్పటికి కోటి క్లెయిములు ఇచ్చినట్టు తెలిపారు. కంపెనీ ట్రైనర్ జక్కా ఉమాదేవి, బ్రాంచి మేనేజరు డి.రామకృష్ణ, ఎస్ఎం నరేష్, ఏడీఎం సూర్యతేజ, ఎస్ఎంలు పాల్గొన్నారు.

వ్యర్థాలు వెంటనే తొలగించండి



తెనాలిఅర్బన్: రోడ్లపై ఉన్న వ్యర్థాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. పట్టణంలోని 37,40 వార్డులలో బుధవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్డుపై వ్యర్థాలు ఉండటాన్ని గమనించిన ఆయన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వ్యర్థాలు కన్పిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ అవుట్ గేట్ వద్ద ఉన్న అన్న క్యాంటిన్‌ను పరిశీలించారు.

18న వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపిక

తెనాలి అర్బన్: జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ జట్టు ఎంపికను ఈ నెల 18న తక్కెళ్ళపాడు గ్రామంలోని శివాలయం ప్రాంగణంలో నిర్వహించనున్నారు. జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింత మల్లికార్జున రావు బుధవారం ఈ మేరకు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30, 31, సెప్టెంబర్ ఒకటో తేదీన అనకాపల్లిలో రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. వివరాలకు 95330 67682లో సంప్రదించాలని కోరారు.

• అమరులారా.. వీరులారా..!



స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జేఎంజే కళాశాల ఎన్‌సీసీ అధికారిణీ డాక్టర్ అరుణ సుజాత పేర్కొన్నారు. జేఎంజే కళాశాల ఎన్‌సీసీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల నుంచి రణరంగచౌక్ వరకు బుధవారం మార్చిఫాస్ట్ (ర్యాలీ) నిర్వహించారు. రణరంగ చౌక్‌లోని అమరవీరుల స్థూపాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థినీలు పాల్గొన్నారు.

-తెనాలిఅర్బన్

• వ్యర్థంతో అర్థం.. పరమార్థం!



78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇనుప వ్యర్థాలతో మహాత్మా గాంధీ విగ్రహాన్ని స్థానిక సూర్య శిల్పశాల నిర్వాహకులు, ప్రముఖ శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర రూపొందించారు. ఐరన్ నట్లు వాషర్లు, సైకిల్ చైన్లు ఉపయోగించి గాంధీజీ రాట్నం వడుకుతున్నట్టుగా ఈ విగ్రహాన్ని తయారు చేశామని తెలిపారు. ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ విగ్రహాన్ని తమ శిల్పశాల ఎదుట ప్రదర్శనగా ఉంచారు.

-తెనాలి

పాక్లెయిన్, లారీ సీజ్

తాడికొండ: రాజధాని ప్రాంతంలోని ఈ- 9 రహదారిలో కంకరను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పాక్లెయిన్, లారీని సీజ్ చేసినట్లు తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

విభజన నాటి చిత్రాల ప్రదర్శన



ప్రదర్శనను ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్



ప్రదర్శనలో ఉంచిన ఫొటోలు

రైల్వేస్టేషన్‌లో ప్రారంభించిన సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్

తెనాలిరూరల్: దేశ విభజన భయానక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి రైల్వే స్టేషన్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ స్వాతంత్ర్య సమరంలో దేశ విభజన బాధాకరమన్నారు. తెనాలిలో విజ్ఞానదాయక, భావోద్వేగ ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినందుకు సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ గుంటూరు ఫీల్డ్ ఆఫీస్‌ను జైన్ అభినందించారు. ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా విభజన కథనాల గురించి మరింత తెలుసుకోవడానికి ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సీబీసీ గుంటూరు ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ ఆర్. రమేశ్‌చంద్ర మాట్లాడుతూ మత ప్రాతిపదికన భారత దేశ విభజన నుంచి యువతరం పాఠాలు నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. మత సామరస్యం, విభిన్న సంస్కృతులను గౌరవించడం భారతదేశ పురోగతిలో కీలకమని ఆయన అన్నారు.

తెనాలి రైల్వేస్టేషన్ మేనేజర్ టి. వెంకట రమణ మాట్లాడుతూ భారతదేశం స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం అన్ని మతాలు, కులాలకు సమాన అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. 1947లో విభజన ప్రక్రియలో ప్రాణాలు కోల్పోయిన ప్రజలకు నివాళులర్పించారు. ఆనాటి ఉద్రిక్త పరిస్థితులు, ప్రజల బాధలను వివరిస్తూ కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ప్రయాణికులు ఆసక్తిగా తిలకించారు. బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, బిట్రా కనక దుర్గ, టి. శివశంకర్ తదితరులు మొదటి రోజు ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. మూడు రోజుల పాటు ప్రదర్శన ఉంటుందని రైల్వే అధికారులు తెలిపారు.

రాత్రి 11 గంటలకు దుకాణాలు మూసివేయాలి

తెనాలిరూరల్: పట్టణంలోని అన్ని దుకాణాలు హోటళ్లను రాత్రి 11 గంటలకే మూసివేయాలని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు అన్నారు. స్థానిక త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం సీఐ విలేకర్లతో మాట్లాడారు. రాత్రి వేళల్లో ఇష్టానుసారంగా రోడ్లపై తిరిగే వారిపై కేసులు నమోదు చేస్తామని చెప్పారు. రాత్రి 11 గంటల తర్వాత సరైన కారణం లేకుండా ఎవరూ రోడ్ల మీదకు రావడానికి వీల్లేదన్నారు. హోటళ్ల, రెస్టారెంట్లు, షాపులు అన్నీ రాత్రి 11 గంటలకు మూసివేయాలని సూచించారు. చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రతి ఒక్కరూ తమ తమ గృహ సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే చోరీల నివారణకు, నేరస్తులను పట్టుకునేందుకు ఉపయోగపడతాయని చెప్పారు. నిబంధనలను ప్రతి ఒక్కరు పాటించాలన్నారు.

బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి

తెనాలి: ఎస్సీ, ఎస్టీ, వికలాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులను ఎప్పటికప్పుడు పూరిస్తున్న ప్రభుత్వాలు వేలాది ఖాళీలున్న బీసీల బ్యాక్‌లాగ్ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అనంతరామన్ కమిషన్ సిఫారసుల మేరకు,1977లో తొలిసారిగా బీసీలకు 25 శాతం రిజర్వేషన్లు ఇచ్చినట్టు గుర్తుచేశారు. చట్టప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు జరపాల్సి ఉన్నా, అన్ని ప్రభుత్వ శాఖల్లో, యూనివర్సిటీల్లో, ఎయిడెడ్ సంస్థల్లో, కార్పొరేషన్లలో పూర్తి స్థాయిలో అమలు జరపడం లేదన్నారు. బీసీలకు రిజర్వేషన్లు ఇప్పటివరకు 8-12 శాతానికి మించలేదన్నారు. అన్ని రంగాలలో పూరించాల్సిన బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు సుమారు లక్ష ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ పోస్టులను వెంటనే భర్తీ చేసి, బీసీ నిరుద్యోగ యువత సాధికారితకు దోహదపడాలని కోరారు.

గంజాయి వినియోగం, రవాణ సహించేది లేదు

త్రీ టౌన్ సీఐ రమేష్‌బాబు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రమేష్‌బాబు, పక్కన ఏఎస్ఐ రమేష్‌బాబు

తెనాలిరూరల్: తెనాలిలో గంజాయి సేవిస్తున్న వారితో పాటు గంజాయి విక్రయాలు చేస్తున్న వారిపై పూర్తి నిఘా ఉంచి వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేస్తున్నామని, గంజాయి వినియోగాన్ని, రవాణాను సహించేది లేదని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు స్పష్టం చేశారు. సుల్తానాబాద్ శివారులో గంజాయి కలిగి ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కిలోన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం త్రీ టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన తెలియజేశారు. స్థానిక 29వ వార్డు పరిధిలోని సుల్తానాబాద్ శివారు కుమార్ పంపుల కాలనీ రైల్వే కరెంట్ సబ్‌స్టేషన్ సమీపంలో కొందరు గంజాయి కలిగి ఉన్నారన్న సమాచారంతో ఆకస్మిక దాడులుచేసినట్టు చెప్పారు. అక్కడ చెంచుపేటకు చెందిన ముక్కామల సంజయ్, కటికల సాయికుమార్, హాఫ్‌పేటకు చెందిన చిక్కాల గిద్యోను, జంపనికి చెందిన మల్లెల వెంకట సుబ్రహ్మణ్య సాయి లోహిత్, మోరిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్‌లను అదుపులోకి తీసుకుని 1500 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిలో పలువురిపై గతంలో కేసులు ఉన్నట్లు తెలిపారు. వీరితో పాటు ఉన్న మరో ఇద్దరు పరారీలో ఉన్నారని వారిని త్వరలో అదుపులోకి తీసుకుంటామన్నారు. ఏడాది కాలంలో త్రీ టౌన్ పరిధిలో ఆరు గంజాయి కేసులు నమోదు చేయడంతో పాటు 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 45 మందిని అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు. గంజాయి విక్రయాలను ఎట్టి పరిస్థితిలో సహించేది లేదని స్పష్టం చేశారు. కేసులో నిందితులను అదుపులోకి తీసుకున్న సిఐ రమేష్‌బాబుతో పాటు ఏఎస్ఐ బి. రమేష్ బాబు, పీసీలు పి. మురళీ, డి.సురేష్, జి.నరేంద్రలను ఎస్పీ సతీష్ కుమార్‌తో పాటు డిఎస్పీ బి. జనార్ధనరావు అభినందించారు.

ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

విద్యార్థులతో న్యాయమూర్తి పవన్‌కుమార్



విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

తెనాలిరూరల్: విద్యార్థులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులుగా నిలవాలని, లక్ష్య సాధకులుగా తమ లక్ష్యాలను చేరుకోవాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ అన్నారు. బుధవారం తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు ఆదేశాల మేరకు తెనాలి ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతివ్యక్తి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని ఈ దశలో చెడు స్నేహాలు, అలవాట్లు పట్ల యువత ఆకర్షితులైతే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. జీవితంలో ఎదుగుదల కోసం ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్య సాధకులుగా ప్రతి విద్యార్థి శ్రద్ధతో ఆ లక్ష్యాన్ని సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం వాడకం పట్ల విద్యార్థి దశ నుంచే అప్రమత్తతతో మెలగాల్సిన అవశ్యకత ఉందని, నూతన సాంకేతిక పరిజ్ఞానం వాడకం మన ఎదుగుదలకు తోడ్పడాలే గాని మన జీవితాలను నాశనం చేసేదిగా ఉండకూదన్నారు. యుక్త వయస్సులో వచ్చే మార్పుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగంలో పెద్ద సంఖ్యలో యువత, విద్యార్థులు ఉండటం బాధాకరమని, వారిని సరైన మార్గంలో పయనింపజేయడానికి ఈ న్యాయ విజ్ఞాన సదస్సులు దోహదపడతాయని తెలిపారు. చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించి వాటికి లోబడి జీవనం సాగించాలని చెప్పారు.

ఎస్ఈబీ ఎస్ఐ ఎ.పద్మజ విద్యార్థులచే మాదక ద్రవ్యాలు లేని దేశాన్ని సాధిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, మండల న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, పీఎల్‌వీ యర్రంశెట్టి అనీల్‌కుమార్, టు టౌన్ పోలీసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సుస్థిర వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు

జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల డైరెక్టర్ డాక్టర్ జె.మురళీధర మీనన్



మాట్లాడుతున్న డాక్టర్ జె.మురళీధర మీనన్

తెనాలి: రైతులు పంటల సాగులో సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటిస్తే అధిక నాణ్యత కలిగిన దిగుబడులతో చక్కని ఆదాయం పొందవచ్చని జాతీయ సుస్థిర సుగంధ ద్రవ్యాల (ఎన్ఎస్ఎస్‌పీ) డైరెక్టర్, కేరళకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ జె.మురళీధర మీనన్ చెప్పారు. రైతులు ఆ దిశగా పంటలను సాగు చేయాలని సూచించారు. కొల్లిపరలోని శ్రేష్ఠ ఉత్పత్తిదారుల సంఘం, నీలగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం కొల్లిపరలో సుస్థిర వ్యవసాయ పద్ధతులపై ఒకరోజు శిక్షణను నిర్వహించారు. కొల్లిపరలో పసుపు పంట సాగులో రైతులు ముందంజలో ఉన్నారని చెప్పారు. ఎత్తుమడులు, బిందుసేద్యం, 'గ్యాప్' సర్టిఫికేషన్ వంటి అంశాల్లో పురోగమిస్తుండటం అభినందనీయమని చెప్పారు. సేంద్రియ పద్ధతులను పాటిస్తూ మరింత మెరుగైన పంటల ఉత్పత్తిని సాధించవచ్చని తెలిపారు. మనదేశంకన్నా చైనాలో ఎనిమిది శాతం అధికంగా సేంద్రియ పదార్థాలు, మూడు శాతం సాధారణ ఎరువులు వినియోగిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ శాఖ తెనాలి ఏడీఏ ఉషారాణి మాట్లాడుతూ, శ్రేష్ఠ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సేంద్రియ పంటల సాగుకు మరింతగా ప్రోత్సాహం అందించాలని సూచించారు. అదేక్రమంలో సర్టిఫికేషన్‌ను కూడా చేపట్టాలని సలహానిచ్చారు. సుస్థిర సాగు విధానాలపై మాస్టర్ ట్రైనర్లు కె.శ్యామ్ సుందరరెడ్డి, సాయిబాబు రైతులకు శిక్షణనిచ్చారు.

బాలికల హైస్కూలులో మంచినీటి కుళాయిల నిర్మాణం

ప్రారంభించిన తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



తెనాలి: పట్టణానికి చెందిన మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవాసమితి ఆధ్వర్యంలో కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర మున్సిపల్ బాలికల హైస్కూలులో రూ.30 వేల వ్యయంతో కుళాయిలను ఏర్పాటు చేశారు. మండల తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. దివంగతురాలైన మొవ్వా విజయలక్ష్మి పేరుతో స్మారక సేవాసమితిని ఏర్పాటుచేసి, సమాజానికి రకరకాలుగా సేవలను అందిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయుడు, సేవాసమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణను ఆయన అభినందించారు. హైస్కూలులో విద్య నభ్యసిస్తున్న విద్యార్థినులకు మినరల్ ప్లాంట్ ఉన్నప్పటికీ కుళాయిలు లేకపోవటం ఇబ్బందికరంగా ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సేవాసమితి ఆధ్వర్యంలో ఏడు కుళాయిలను ఏర్పాటు చేసినట్టు సత్యనారాయణ వెల్లడించారు. మొవ్వా విజయలక్ష్మి వ్యాయామ ఉపాధ్యాయినిగా సుదీర్ఘకాలం పనిచేసిన బాలికల హైస్కూలులో గతంలో తరగతి గదులను నిర్మించినట్టు ఆయన గుర్తుచేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ తెనాలి చైర్మన్ కొలసాని రామ్‌చంద్ మాట్లాడుతూ, బుర్రిపాలెం రోడ్డులోని మహాప్రస్థానంలో సందర్శకులకు షెల్టర్, అస్తికలను భద్రపరచుకునే లాకర్ వ్యవస్థను సేవాసమితి గతంలోనే నిర్మించిందని చెప్పారు.

వేర్వేరు చోరీ కేసుల్లో నిందితుల గుర్తింపు

నాలుగు సవర్ల బంగారు గొలుసులు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గొలుసులు

తెనాలిరూరల్: తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన వేర్వేరు చోరీ ఘటనల్లో బాలిక సహా మహిళను పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి మొత్తం నాలుగు సవర్ల బంగారు గొలుసులను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్. రమేష్ బాబు కేసు వివరాలను తెలియజేశారు. చిన రావూరుతోటకు చెందిన 14 ఏళ్ల బాలిక ఇటీవల తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో రోగుల బంధువుగా తిరుగుతూ చోరీలకు పాల్పడుతోంది. వరుసగా జరుగుతున్న చోరీలతో వైద్యశాల సూపరింటెండెంట్, అధికారులు సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది నిఘా ఉంచగా బాలిక చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించి ఆమెను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇదే బాలిక గతేడాది నవంబరులో తన తమ్ముడితో పాటు ఇంటి సమీపంలో నివసించే మరో ఇద్దరు చిన్నారులను విజయవాడలో పార్కును చూపిస్తా, సాయంత్రంలోగా తిరిగి వచ్చేయవచ్చని చెప్పి ఎవరికీ చెప్పకుండా విజయవాడ తీసుకెళ్లింది. పిల్లలు కనబడకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా కొద్ది గంటల వ్యవధిలోనే వారి ఆచూకీ గుర్తించి తల్లదండ్రులకు అప్పగించారు. అదే విధంగా ప్రభుత్వ వైద్యశాలలోనే రోగుల సహాయకులకు చెందిన రెండున్నర సవర్ల బంగారు చైన్‌ను అక్కడ సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న ఆయా డి. కుమారి చోరీ చేసింది. మరి కొందరు సహాయకుల బ్యాగుల్లోని నగదునూ అపహరించింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితురాలిని గుర్తించినట్టు తెలిపారు. రెండు కేసుల్లోనూ సీసీ కెమేరాలు ఎంతగానో ఉన్నయోగపడ్డాయని చెప్పారు. నిందితులిద్దరూ తొలిసారి చోరీ ఘటనల్లో పట్టుబడడంతో చోరీ సొత్తును రికవరీచేసి వారిని వారించామని, మరోసారి నేరానికిపాల్పడితే కఠినశిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌బాబు తెలిపారు.